నా ఇంటి స్థలాన్ని కబ్జా చేశారు

- కోర్టులో కేసు ఉండగానే కాంగ్రెస్ నేత
- దౌర్జన్యంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు
- బీఆర్ఎస్ నాయకుడు మల్లేశ్ ఆవేదన

మాట్లాడుతున్న నాయకులు

పెద్దకొత్తపల్లి, మార్చి 13 : తన ఇంటి స్థలాన్ని అక్రమంగా కబ్జా చేయడమే కాకుండా కాంగ్రెస్ నాయకులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని బీఆర్ఎస్ నాయకుడు మల్లేశ్ వాపోయాడు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల నాయకులు నాగరాజు, విష్ణుతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అధికార పార్టీ నాయకులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. పెద్దకొత్తపల్లి మండలం యాపట్లలో తన ఇంటి స్థలాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకుడు కొంత మేర కబ్జా చేసి గతనెల 9వ తేదీన అధికార బలం ఉపయోగించి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నాడని వాపోయాడు. స్థలాన్ని కబ్జా చేసినట్లు కోర్టులో కేసు వేయడంతో గతంలో ఓసారి రిజిస్ట్రేషన్ జరగకుండా డాక్యుమెంట్ పెండింగ్‌లో పెట్టించామన్నారు. తర్వాత ఇంటి నెంబర్‌ను తప్పుడు పద్ధతిలో (2-100 కు డా 2-109గా) మార్చుకొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఆరోపించాడు. కావాలనే తమను వేధింపులకు గురిచేస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యాడు. తన ఇంటి ముందు నడిచేందుకు కూడా స్థలం లేకుండా కబ్జా చేసి గోడలు కట్టేందుకు యత్నిస్తున్నాడని వాపోయాడు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ రాజకీయ కక్షలతో ఆస్తులపై పడటం మంచి పద్ధతి కాదని సూచించారు.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే ప్రజలు తిరగబడే రోజులు వస్తాయని హెచ్చరించారు. వెంటనే కబ్జా చేసిన స్థలాన్ని మల్లేశ్‌కు అప్పగించాలన్నారు. బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్న కార్యకర్తలను టార్గెట్ చేసి వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు.

చంద్రకల్ పాఠశాలను సందర్శించిన డీఈవో

కంప్యూటర్లను పరిశీలిస్తున్న డీఈవో

పెద్దకొత్తపల్లి, మార్చి 13: మండలంలోని చంద్రకల్‌లో ప్రభుత్వ పాఠశాలను డీఈవో రమేశ్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ నెల 15న ఏఐ బోధనా తరగతులను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ముందస్తుగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్లను పరిశీలించారు. విద్యార్థులకు గణిత, తెలుగు పాఠాలు ఏఐ ద్వారా బోధన కొనసాగుతుందని ఈడీవో తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 13ప్రాథమిక పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ఏఐ బోధన చెబుతున్నట్లు పేర్కొన్నారు. డీఈవో వెంట జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్, ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని రిలే దీక్షలు

మున్సిపల్ కార్యాలయం ముట్టడిలోనాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్, మార్చి 13: జిల్లా కేంద్రంలోని 17వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న రిలే నిరాహార దీక్షలు నాల్గవరోజు మున్సిపల్ కార్యాలయం ముట్టడి చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి పృథ్వీరాజ్ కాలనీకి సౌకర్యాలు కల్పించే విషయంలో పాలకులు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని ఘాటుగా విమర్శించారు. జిల్లా కేంద్రంలో బీసీ కాలనీలో మిషన్ భగీరథ నీళ్లు, ఇంటి నెంబర్లు లేక పోవడం, డ్రైనేజీ పనులు సగం చేసి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నాల్గవ రోజు స్పందించిన మున్సిపల్ కమిషనర్ దీక్షా శిబిరం వద్దకు వచ్చి తన పరిధిలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరిస్తానని చెప్పారన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కాలనీని సందర్శించి సమస్యలు వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, తిరుపతయ్య, నిరంజన్, వెంకటయ్య, రవి, గోపాల్, హేమలత, అమృత, అంజనమ్మ, రాజేశ్వరి, షాహీన్ బేగం,హుస్సేన్‌బీ, ఈశ్వరమ్మ, వెంకటమ్మ, కాశమ్మ, పాల్గొన్నారు.

దీక్షకు మద్దతుగా..

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేశ్యానాయక్, ఆంజనేయులు, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు మద్దతుగా పాల్గొని ప్రసంగించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్, మార్చి 13: అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.అశోక్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని శ్రీపురంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో సర్వే చేశారు. అర్హులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే గ్రామంలో డ్రైనేజీ లేని కాలనీల్లో మురుగు నీరు రోడ్లపైకి వస్తుందని పట్టణ అభివృద్ధి మీద పెట్టిన దృష్టి పల్లెలపై చూపక పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలనాగులు, రాములు, రమేశ్ తదిరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట రూరల్, మార్చి13: పట్టణంలో అర్హులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను కట్టించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దేశ్యానాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. గత ప్రభుత్వం పేదలకు కేటాయించిన కొంత భూమిలో డబుల్ బెడ్రూం నిర్మాణం చేసి పేదలకు పంచిపెట్టిందని గుర్తు చేశారు. మిగిలిన ఖాళీస్థలంలో పేదలకు అక్కడ ఇందిరమ్మ ఇండ్లను కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో మాధవికి అందజేశారు. నాయకులు శంకర్‌నాయక్, నిర్మల, సైదులు, సయ్యద్, శివకుమార్, రాములు, మధు, రేవల్లి సైదులు, మహిళలు పాల్గొన్నారు.

కాముడి దహనం

కాముడి దహనం చేస్తున్న గ్రామస్తులు

తాడూరు, మార్చి 13: హోలీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని ఒక రోజు ముందుగా కాముని దహనం చేసే కార్యక్రమం కొనసాగించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రోజు హోలీ పండుగను జరుపుకుంటున్న నేపథ్యంలో గురువారం రాత్రి కాముని దహనం చేశారు.

బాల్యాన్ని సంతోషంగా గడపాలి

- డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శ్రీరామ్ ఆర్య

నాగర్‌కర్నూల్, మార్చి 13: బాల్య జీవితాన్ని చిన్నారులు సంతోషంగా గడపాలని, 6 నుంచి 14సంవత్సరాలలోపు పిల్లలందరూ పాఠశాలల్లో ఉండాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సెక్రటరీ ఆదేశాల మేరకు చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్ స్కీం గురించి మండలంలోని శ్రీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల గురించి వివరిస్తూ 6నుంచి 14ఏళ్లలోపు వచ్చే వరకు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలలకు వెళ్లి చదువుకోవాలన్నారు. అమ్మాయిలు 18ఏళ్లు నిండిన తర్వాతనే పెళ్లి చేసుకోవాలని, బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారాన్ని 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. తద్వారా బాల్యవివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవచ్చని, బాలికలకు రక్షణ లభిస్తుందని, ఫోక్సో చట్టం అమ్మాయిలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. విద్యార్థులు గురువులు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని ఉన్నత చదువులు చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఉచిత న్యాయ సహాయంకోసం 15100 టోల్‌ఫ్రీ నెంబర్‌కు డయల్ చేయాలన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిస కాకుండా వాటికి దూరంగా ఉండాలన్నారు. ప్యానల్ అడ్వకేట్ యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగావారికి ఇష్టమైన రంగంలో ఎదిగి వారి గురువులకు తల్లిదండ్రులకు మంచిపేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు.

కార్యక్రమంలో హెచ్ఎం రమేశ్, ప్యానల్ అడ్వకేట్స్ రాంబాబు, ప్యారా లీగల్ వలంటీర్లు శ్రీనివాసులు, పరశురాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్డెన్‌పై సోషల్ వెల్ఫేర్ అధికారి ఆగ్రహం

వంగూరు, మార్చి 13: మండలంలోని పోల్కంపల్లిలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహాన్ని గురువారం ఏఎస్‌డబ్ల్యూ శ్రీకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 8గంటల సమయంలో వార్డెన్ హాస్టల్‌లో లేక పోవడంతో పాటు విద్యార్థులు సైతం తక్కువగా ఉండటంతో వార్డెన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌ను సందర్శించకుండా పట్టణాల్లో ఉంటూ విద్యార్థులను ఎలా చూసుకుంటావని మండిపడ్డారు.

ఎండిన పంటలు పరిశీలన

పంట వివరాలు తెలుసుకుంటున్న ఏఈవో

చారకొండ, మార్చి 13: భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో మండలంలో చంద్రాయన్‌పల్లి, సిరుసనగండ్ల గ్రామాల్లో రైతులు పంట సాగు చేసి ఎండి పోయిన వరి పంటలను ఏవో తనూజరాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో వరి పంటలు పూర్తిగా ఎండిపోయాయని చెప్పారు. చంద్రాయన్‌పల్లి, సిరుసనగండ్ల శివారులో 21ఎకరాల వరి పంట పూర్తిగా ఎండి పోయినట్లు గుర్తించామని చెప్పారు. ఎండిన పంట వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవోలు వంశీ, మహేశ్వరి పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి

కొల్లాపూర్, మార్చి 13: మండలంలోని ప్రధాన ప్రాజెక్టులు ఎంజీకేఎల్ఐ, పీఆర్ఎల్ఐ ప్రాజెక్టులు ఉన్న సమీపంలో కృష్ణానది ఉన్న పంటలు ఎండిపోతున్నాయని రైతు సంఘం మండల కార్యదర్శి బాలపీరు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని ఎండిన పంటలను రైతు సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎండిన పంటలను అంచన వేసి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు ఉన్నారు.

రైతులకు అవగాహన కార్యక్రమం

పెద్దకొత్తపల్లి, మార్చి 13: మండలంలోని పెద్దకార్పాములలో రైతు వేదిక వద్ద గురువారం రైతులకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రైతు భరోసా, రైతు బీమా పథకాల గురించి వివరించారు. అలాగే రైతులకు పంటల సాగు విధానంపై అవగాహన చేపట్టారు. కార్యక్రమంలో ఏఈవో జానకి రాములు, వలంటీర్లు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

పెద్దకొత్తపల్లి, మార్చి 13: చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామస్వామి సతీమణి రామకృష్ణమ్మ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం మండల గౌడసంఘం నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆర్థిక సహాయంగా రూ. 10వేలు అందజేశారు. నాయకులు ఉదయ్ గౌడ్, భరత్ గౌడ్, కవీందర్ గౌడ్, ప్రసాద్ గౌడ్, కుమార్ గౌడ్, బచ్చన్న గౌడ్, సురేందర్ గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ

కల్వకుర్తి రూరల్, మార్చి13: మండలంలోని రఘుపతిపేటలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో ప్యాడ్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్లబ్ అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులు దాతల సమకూర్చిన వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలని కోరారు. హెచ్ఎం అంజయ్య, ఉపాధ్యాయులు క్లబ్ సభ్యులు రవీందర్‌రెడ్డి ఉన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేటటౌన్, మార్చి 13: పట్టణంలోని ఆశ్రమ పాఠశాలలోని నిరుపేద విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేసినట్లు క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి నరేశ్ తెలిపారు. శివ శంకర్, నరేశ్, పెద్ది మురళి, కొత్త రమేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రక్తదానం జీవిత విధానం కావాలి

- లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ

ప్రశంసా పత్రం అందించిన సభ్యులు

నాగర్‌కర్నూల్ రూరల్, మార్చి 13: రక్తదానం జీవిత విధానంలో భాగంగా మలుచుకోవాలని లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల భాగస్వామ్యంతో లయన్స్‌క్లబ్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదానం శిబిరం రాధాకృష్ణ ప్రారంభించి మాట్లాడారు.. విద్యార్థి దశలోనే రక్తదానాన్ని అలవాటుగా చేసుకుంటున్న కళాశాల విద్యార్థులకు అభినందనీయులని అన్నారు. 18ఏళ్లు పూర్తయి 50కిలోల బరువు ఉన్న ప్రతి వ్యక్తి రక్తదానం చేయవచ్చునని తెలిపారు. విద్యార్థులు ధైర్యంగా ముందుకు రావడం సంతోషకరమని, రక్తం డబ్బుతో తయారు చేయలేమని కేవలం దాతల ద్వారానే లభిస్తుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని బ్లడ్ బ్యాంకులో ప్రస్తుతం రక్తం స్టాక్ లేదని ఈ రోజు మీ క్యాంప్ ద్వారా దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులకు అవసరమైన రక్తం దొరుకుతుందని, మీరు ప్రతి ఆరు నెలల కొకసారి రక్తదానం చేయడం అలవాటుగా మార్చుకుని సహాయ పడాలని కోరారు. శిబిరంలో 55మంది కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు రక్తదానం చేశారు. శిబిరంలో రాధాకృష్ణతోపాటు బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ రోహిత్, రెడ్‌క్రాస్ సెక్రటరీ రమేశ్ రెడ్డి, లయన్స్ అధ్యక్షుడు రాధారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, శిబిరం సమన్వయకర్త డాక్టర్ కోదండ రాములు, రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను, హకీం విశ్వప్రసాద్, రాజావర్ధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, కార్యదర్శి వాస లక్ష్మి, నాగరాణి, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు కృష్ణారావు పాల్గొన్నారు.

కిడ్నీ ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

- సూపరింటెండెంట్ డాక్టర్ రఘు

కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ రఘు, సిబ్బంది

నాగర్‌కర్నూల్/రూరల్, మార్చి 13: ప్రతిఒక్కరూ కిడ్నీ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని నాగర్‌కర్నూల్ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ రఘు అన్నారు. గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని దవాఖాన డయాలసిస్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేక్ కట్‌చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కిడ్నీ మనిషి శరీరంలో నిర్వహించే పనితీరు గురించి చెప్పారు. మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై ప్రజల్లో అవగాహన అవసరమని, ప్రతి రోజూ కనీసం 40నిమిషాలు నడక, వ్యాయామం, యోగాసనాలు నిత్యం జీవితంలో ఒక భాగంగా అలవర్చుకోవాలన్నారు. దవాఖానలో డయాలసిస్ సేవలు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో రెసిడెన్స్ మెడికల్ ఆఫీసర్స్ రవిశంకర్, డాక్టర్ అజీమ్, డాక్టర్ ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ సద్గుణ, డాక్టర్ నీలిమ, డాక్టర్ సుప్రియ, డాక్టర్ రాజేశ్, వివిధ విభాగాల వైద్యాధికారులు, ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది, రోగులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కల్వకుర్తి రూరల్, మార్చి13: మానవశరీరంలో కిడ్నీలు అతి ముఖ్యమైన భాగాలలో ఒకటని ప్రతి ఒక్కరూ కిడ్నీలకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ దవాఖానా సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం సూచించారు. గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవ సందర్భంగా డయాలసిస్ కేంద్రంలో రోగులకు కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యులు యశోద, వసంత, స్వప్న, శివ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలి

నాగర్‌కర్నూల్ రూరల్, మార్చి 13: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులను కేటాయించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శివశంకర్ గౌడ్, రాష్ట్ర సభ్యుడు బంగారు బాబు డిమాండ్ చేశారు. గురువారం ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏవో చంద్రశేఖర్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తామని అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంపై సవతితల్లి ప్రేమ చూపిస్తుందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను విడుదల చేయాలన్నారు. విద్యారంగంలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని యూనివర్సిటీలకు బ్లాక్ గ్రాంట్‌ను వాటి బడ్జెట్ మేరకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌చార్జి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి శారద శివ, మల్లేశ్ యాదవ్, రమేశ్, మహేశ్ పాల్గొన్నారు.

ఉపాధిపనులను సద్వినియోగం చేసుకోవాలి

చారకొండ, మార్చి 13: ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించి, పనులకు కూలీలు అధికంగా వచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకొని, నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నిత్యం పారిశుధ్య చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్, ఏపీవో లక్ష్మయ్య, ఈసీ రవినాయక్ పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

అటెండర్‌కు సన్మానిస్తున్న ఎంఈవో

లింగాల, మార్చి 13: విధులపై అంకిత భావంతో పని చేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని ఎంఈవో బషీర్‌అహ్మద్ అన్నారు. మండలంలోని ధారారం ప్రాథమికోన్నత పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆవుల హుసేన్ గురువారం పదవీ విరమణ పొందడంతో సన్మానించి మాట్లాడారు.. వయస్సు పైబడిన వారికి పదవీ విరమణ సహజమేనని అన్నారు. హెచ్ఎం పర్వతాలు, ఉపాధ్యాయులు రాందాస్, ప్రత్యూష పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

తిమ్మాజిపేట, మార్చి 13: ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో ఈ నెల 15నుంచి నిర్వహిస్తున్న భీమ్ దీక్షా వాల్ పోస్టర్‌ను గురువారం మండలంలోని తాసీల్దార్ కార్యాలయంలో తాసీల్దార్ రామకృష్ణయ్య విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 14వరకు ఈ దీక్షలో వివిధ జిల్లాలలో జరుగుతుందని స్వేరో నెట్‌వర్క్ ప్రతినిధి విజయకుమార్ తెలిపారు. అక్షరం, ఆర్థికం, ఆరోగ్యంపై ప్రతిరోజూ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సభ్యులు, అభిమానులు పాల్గొని దీక్షను విజయవంతం చేయాలని కోరారు. కారక్రమంలో నరేశ్, రవి, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు ప్రారంభం

కోడేరులో రిలే దీక్షలో మాట్లాడుతున్న ఆదిసోమనాథ్

కోడేరు, మార్చి 13: మండలంలోని గురువారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మిద్దె కృష్ణయ్య ఆధ్వర్యంలో రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బహుజన సంఘాల జిల్లా ఉపాధ్యక్షుడు ఆదిసోమనాథ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మిద్దె కృష్ణయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం అమలయ్యే వరకు గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3 ఫలితాలను నిలిపి వేయాలని వర్గీకరణను ఏబీసీడీలుగా విభజించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ అసెంబ్లీ సాక్షిగా మా దిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు పదవులు ఇవ్వాలని వర్గీకరణ పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు విడతల వారిగా రిలే దీక్షలను కొనసాగిస్తామని పిలుపునిచ్చారు. బొట్టు వెంకటస్వామి, శివకుమార్, బాలకృష్ణ, నర్సింహ, బాలయ్య, వీరస్వామి, గంగయ్య, బుడ్డయ్య, తేజ పాల్గొన్నారు.

ఊర్కొండలో..

ఊర్కొండ, మార్చి13: మండలంలోని ఎస్సీ వర్గీకరణకు చట్టం చేయాలని నిరహార దీక్షలో ఎమ్మార్పీస్ జిల్లా నాయకులు గుడిగానిపల్లి రాజుమాదిగ మాట్లాడుతూ.. జనాభా ప్రకారం ఏబీసీడీలుగా వర్గీకరణ చేసి రెండు గ్రూపులుగా చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల మాదిగ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్ రూరల్, మార్చి 13: పట్టణంలోని ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీస్ నాయకుడు మంద నర్సింహ మాట్లాడుతూ.. ప్రభుత్వం జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణను ఏబీసీడీలుగా చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అగ్రస్వామి, పుట్టపాగ రాము, కొల్లాపూర్ మండల ఇన్‌చార్జి ఏదుల రాముడు, బత్తిని పరమేశ్, ఎంఈఎఫ్ నాయకులు కారంగి నర్సింహ, బాలస్వామి, చిన్నరాము, మహేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బిజినేపల్లి, మార్చి 13: మండలంలోని వడ్డెమాన్‌కు చెందిన సుల్తాన్ కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు రాజేశ్, విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని ఓదార్చి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

జేఎల్‌గా ఉపాధ్యాయుడి ఎంపిక

కొల్లాపూర్ రూరల్, మార్చి 13: కొల్లాపూర్ పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న బయోసైన్స్ ఉపాధ్యాయుడు ఎం.ప్రవీణ్‌కుమార్ జేఎల్‌కు ఎంపికయ్యాడు. గురువారం హెచ్ఎం శోభారాణి ప్రవీణ్ కుమార్‌ను రిలీవ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జేఎల్‌కు ఎంపికైనందుకు ప్రవీణ్ కుమార్‌కు అభినందనలు తెలిపారు. ప్రవీణ్‌కుమార్ భవిషత్‌లో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు అర్జున్ గౌడ్, రామ్మూర్తి, గాల్‌రెడ్డి, భాస్కర్, బాలయ్య, సుదర్శన్, కృష్ణ, జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ తోనే సంక్షేమాభివృద్ధి సాధ్యం

మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ దార్లకుమార్

వెల్దండ, మార్చి 13: బీఆర్ఎస్ 10ఏళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, బీఆర్ఎస్‌తోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని బైరాపూర్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు దార్లకుమార్ అన్నారు. గురువారం మండలంలోని ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15నెలలు గడుస్తున్నా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీటీరోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయిస్తే వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. భైరాపూర్ వంతెన నిర్మాణానికి రూ.9 కోట్లు నిధులు కేటాయించి టెండర్లు పిలిచాక రద్దుచేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలకు మేలు చేసే పని చేయాలని, రాజకీయం చేయొద్దని హితవు పలికారు. మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్, లింగం ముదిరాజ్, ఆనంద్ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

వంగూరు, మార్చి 13: తెలంగాణ రాష్ట్ర సారధి, మాజీ సీఎం, ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తగదని కేటీఆర్ సేవా సమితీ జిల్లా అధ్యక్షుడు అంకు సురేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తెలంగాణ మేధావులు,ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు. సీఎం హోదాకు తగిన మాటలు మాట్లాడటక పోవడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యమని మరోసారి పేర్కొన్నారు. గురువారం శాసనసభలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం తన తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తుందని, దీన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

రైతులు వయస్సు సవరణ చేసుకోవద్దు

బిజినేపల్లి, మార్చి 13: రైతులు ఫించన్లకోసం ఆశపడి ఆధార్‌కార్డులో వయస్సును సవరణ చేసుకోవద్దని ఏవో నీతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫించన్‌కోసం వయస్సు ఎక్కువగా ఉన్నట్లు చూపడంతో సదరు రైతు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆధార్ పోర్టల్‌లో వయస్సు ఎక్కువగా కనిపించడం వల్ల రైతు బీమాకు అనర్హత ఏర్పడుతుందన్నారు. రైతులు వయస్సు సవరణ చేసుకోవద్దన్నారు.

ఉపాధి కూలీలకు పని కల్పించాలి

నాగర్‌కర్నూల్ రూరల్, మార్చి 13: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు 200రోజుల పని కల్పించాలని కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అజ్జపాగ సుభాశ్ అన్నారు. గురువారం మండలంలోని తూడుకుర్తిలో ఉపాధి పనులను సందర్శించి కూలీలతో మాట్లాడారు. పనిచేసే కూలీలకు రోజుకు 100, 150 మించి కూలి పడడం లేదని రోజు కూలి 600రూపాయలు ఇవ్వాలన్నారు. భూమి లేని వ్యవసాయ కూలీలకు జాబ్‌కార్డుతో నిమిత్తం లేకుండా సంవత్సరానికి 12వేల రూపాయలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి కూలీ రాములు, శివ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలి

వంగూరు, మార్చి 13: స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ.. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం మండలంలోని సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నేతలు బాలీశ్వర్, గౌతం మాట్లాడుతూ.. నామినేటెడ్ పోస్టుల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి బాలస్వామి, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

అచ్చంపేటటౌన్, మార్చి 13: పట్టణంలో నిర్వహిస్తున్న ఐదు పరీక్షా కేంద్రాల్లో గురువారం ఇంటర్ పరీక్షలు సజావుగా కొనసాగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు 81మందికిగాను 07మంది గైర్హాజరు కాగా 74మంది హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల కళాశాలలో 92మందికిగాను 13మంది గైర్హాజరు కాగా 79మంది హాజరయ్యారు. ప్రగతి జూనియర్ కళాశాలలో 381మందికి గాను 32మంది గైర్హాజరు కాగా 349మంది హాజరయ్యారు. త్రివేణి జూనియర్ కళాశాలలో 111మందికిగాను 09మంది గైర్హాజరు కాగా 102మంది విద్యార్థులు హాజరయ్యారు. చైతన్య జూనియర్ కళాశాలలో 101మందికిగాను 06మంది గైర్హాజరు కాగా 95మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ వెంకటయ్య, తెలిపారు.

ఉప్పునుంతల సింగిల్‌విండో సేవలు భేష్

ఉప్పునుంతల, మార్చి13: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సేవలు అమోఘమని, బ్యాంక్ పెంచుకున్న వనరుల తీరు బాగుందని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సింగిల్‌విండో కార్యాలయాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు.. సంఘం చేపడుతున్న కార్యకలాపాలు బాగున్నాయన్నారు. పురుషోత్తంరావు ఏజీఎం భూపాల్‌రెడ్డి, భూపాల్‌రావు, హన్మంత్‌రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★DTCP ప్లాట్స్ @ RRR జంక్షన్ కడ్తాల్, ఆమనగల్, శ్రీశైలం రోడ్ 150 గ|| 530 Sft. 18-28 లక్షలు నెలకు 10K రెంట్. Ph: 9000250099.
NT-337315

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748